పాఠం

6

# కూనవరం - కొండలమీదున్న గిరిజన గ్రామాలు

*మనం తీరమైదానాలు, వర్షాధార పీఠభూములలోని జీవన విధానాన్ని గత పాఠాలలో చదివాం. ఈ పాఠ్యాంశంలో వేరొక విభిన్నమైన జీవన విధానాన్ని గూర్చి తెలుసుకోబోతున్నాం. అదే కొండ ప్రాంతం. మీరెప్పుడైనా ఏదైనా కొండప్రాంతంలో జీవించారా? లేదా ఏదైనా అటువంటి ప్రాంతానికి వెళ్ళారా? కొండను వర్ణించగలరా? అక్కడ నీవేమి చూసావు? ఆ ప్రాంతంలోని ప్రజలు ఎలాంటి పనులు చేస్తారు?*




*చిత్రం 6.1 బైసన్ కొండల ఉపరితలం*

## బైసన్ కొండలు

బైసన్ కొండలు ఖమ్మం, ఉభయగోదావరి జిల్లాలలో గోదావరి నదికి రెండు వైపులా వ్యాపించి ఉన్నాయి. గోదావరి ఉపనదులైన శబరి, సీలేరు ఈ కొండలనుంచే ప్రవహిస్తున్నాయి. క్రింద ఇచ్చిన పటం(6.2)లో వీటిని గుర్తించండి.

ఈ కొండవాలు ప్రాంతాలలో అనేక గిరిజన తెగలు నివసిస్తున్నాయి. వీరిలో కొండరెడ్లది ప్రత్యేకమైన జీవన విధానం. వీరు ఖమ్మంజిల్లాలోని కూనవరం, చింతూరు, వేలేరుపాడు, కుక్కునూరు, దమ్మపేట, అశ్వారావుపేట మండలాలలో విస్తరించి ఉన్నారు.




*పటం 6.2 ఖమ్మం జిల్లా చిత్తుపటం.*

ఉత్తరదిశనుంచి ప్రవహించే శబరి, గోదావరితో సంగమించే ప్రాంతంలో కూనవరం వుంది. ఈ ప్రాంతంలోని కొండరెడ్ల జీవనాన్ని పరిశీలించడానికి మా బృందం వెళ్లింది. కూనవరం నుంచి మేము కొండ దిగువన నున్న భగవాన్‌పురం గ్రామానికి వెళ్లాం. అక్కడ నుంచి కాలిబాట కొండలపైకి దారి తీస్తుంది. బాట ఆసాంతం ఇరుకుగా, నిటారుగా, జారుడుగా ఉంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా కాలు జారితే కొండ లోయలో పడిపోవలసిందే. అటువంటి బాటలో మూడు, నాలుగు గంటలు నడిచి మేము కొండరెడ్ల ఆవాస ప్రాంతాన్ని చేరుకున్నాం. దారిలో మేం వెదురు బుట్టలను తీసుకెళుతున్న స్త్రీలను చూశాం. కింద మైదానంలో గల మార్కెట్‌కు వారు వెళుతున్నారు.

## బైసన్ కొండల ఉపరితలం

కొండరెడ్లు మరీ చిన్న చిన్న ఆవాసప్రాంతాలలో ఉంటూంటారు. ఒక ప్రాంతంలో నాలుగైదు గుడిసెల సముదాయమే ఒక కొండరెడ్డి గ్రామం. ఒక ఆవాస ప్రాంతానికి, మరొక ఆవాస ప్రాంతానికి మధ్య నాలుగు నుంచి ఐదు కిలోమీటర్లు వుండవచ్చు.

◆ బైసన్ కొండల ఉపరితలానికి సంబంధించి కింద ఇచ్చిన ఫోటోలను పరిశీలించండి. పెనుమకూరు, సలకంచెరువు ఉపరితలాలతో వీటిని పోల్చండి.

కొండచరియల పైకి ప్రయాణిస్తూంటే దట్టమైన అటవీప్రాంతం, మధ్యమధ్యలో అడవిని తొలగించి ఏర్పరచిన వ్యవసాయక్షేత్రాలు ఉన్నాయి. ఇవన్నీ కొండలలో చెల్లాచెదురుగా ఉంటాయి. ఒకే ఎత్తులో ఉండవు. ఎక్కువ వాలు కలిగి ఉంటాయి. ఎర్రని ఈ నేలలు రాళ్లు, రప్పలతో కూడి ఉంటాయి.

వారి జీవితాల గురించి తెలుసుకోవడం కోసం మేం వారితో మాట్లాడినాము. వారు తెలుగులో మాట్లాడారు. దానితో మాకు వారితో సంభాషించడం సులువయింది.



*చిత్రం 6.3 కూనవరం గ్రామానికి దారి*

© SCERT not to be republished



*చిత్రం 6.4 అడవుల నరికివేత*

## పోడు

"పోడు" అనే ప్రత్యేక వ్యవసాయవిధానం ద్వారా కొండరెడ్లు పంటలను సాగుచేస్తారు. కొండలలో ఇది అత్యంత పురాతన విధానం. దీన్ని స్థలమార్పిడి వ్యవసాయం లేదా 'ఝూమ్' విధానం అని కూడా అంటారు. ఛత్తీస్‌గఢ్ మరియు అరుణాచల్‌ప్రదేశ్ వంటి ఈశాన్య రాష్ట్రాలలో పోడు అమలులో ఉంది. అడవిలో కొంత ప్రాంతంలో చెట్లను నరికి, వాటిని కాల్చి చదును చేస్తారు. ఆ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలు సాగు చేస్తారు. తరవాత నిస్సారమైన ఆ ప్రాంతాన్ని విడచి మరొక ప్రాంతానికి వెళ్లి అక్కడ చెట్లు నరికి మళ్ళా కొన్ని సంవత్సరాలు వ్యవసాయం చేస్తారు.

బైసన్ కొండలలో నవంబర్‌లో వర్షాలు ఆగిపోతాయి. ఈ కొండలలో కొండరెడ్లు డిసెంబరు నెలలో చెట్లు నరుకుతారు. ఈ చెట్ల దుంగలను, కొమ్మలను, ఆకులను కొన్ని నెలలపాటు అక్కడ ఎండనిస్తారు. వానాకాలానికి ముందు అంటే ఏప్రిల్, మే నెలల్లో తగలబెడతారు. అంటే వానలకు ముందు నేల బూడిదతో కప్పి ఉంటుంది. జూన్ నెలలో వర్షాలు ప్రారంభంకాగానే గిరిజనులు కట్టెలతో నేలను పొడిచి విత్తనాలు విత్తుతారు లేదా అనేక రకాల విత్తనాలను కలిపి వెదజల్లుతారు. వీరు వ్యవసాయానికి నాగళ్ళు, రసాయనిక ఎరువులు వాడరు.

కొండరెడ్లు ట్రాక్టర్లు, నాగళ్లు ఎందుకు వాడరో చెప్పగలరా? ఎందుకంటే బహుశా కొండచరియలలో పై సాధనాలు ఉపయోగిస్తే నేల పైపొరలు చాలా సులభంగా కొట్టుకుపోయి నేల నిస్సారమౌతుంది.

పంట పండే తరుణంలో అడవి మృగాలనుండి, పక్షుల నుంచి రక్షణకోసం వాళ్ళు మంచెలు కట్టి కాపలాకాస్తారు. పండిన పంటను డిసెంబర్‌లో కోస్తారు. కొండరెడ్లు పండించే అతిముఖ్యమైన పంట జొన్నలు. వీరు పండించే ప్రధానమయిన పంటలు మొక్కజొన్న, దుంపలు, చిరుధాన్యాలు, (సామలు, కొర్రలు, అడుసులు), కందులు, పెసర వంటి పప్పుధాన్యాలు నువ్వులు, వంగ, మిర్చి వంటి కూరగాయలు. వీరు మిశ్రమ పంటలను నీటిపారుదల



*చిత్రం 6.5 కట్టెతో విత్తనాలను నాటడం*



© SCERT not to be republished



*చిత్రం 6.6 పోడు పొలాల్లో పంటలు*

లేకుండానే సాగు చేస్తారు. వీరి వ్యవసాయం వర్షాధారమే. దీని ద్వారా వీరికి ఆరు నెలల పాటు ఆహారం లభిస్తుంది.

ఒక ప్రాంతంలో సుమారు 3 నుంచి 4 ఏళ్లు పోడుభూమిని సాగుచేస్తారు. ఆ తరవాత 3-5 సంవత్సరాల పాటు దాన్ని వదలి పెడతారు. ఆ సమయంలో ఆడవిచెట్లు మళ్లీ పెరుగుతాయి. వీటిని నరికి కొన్ని సంవత్సరాలపాటు తిరిగి సాగు చేస్తారు.

ఒకప్పుడు సగటున ప్రతి కొండరెడ్డి కుటుంబం సంవత్సరంలో 2 నుంచి 2 1/2 ఎకరాల భూమి చదును చేసేది. పోడుభూమిలో జొన్న సగటు ఉత్పాదకత ఎకరానికి 250 కిలోలు కావడంతో ప్రతి కుటుంబం 600 కిలోల జొన్నలు, 150 నుంచి 250 కిలోల చిరుధాన్యాలు పొందేది. అయితే ప్రస్తుతం సాగుభూమి 1 నుంచి 1 1/2 ఎకరానికి పరిమితమయింది. దీనివల్ల వారికి అందే ఆహారధాన్యాలు తగ్గాయి.

- ఇటీవల కాలంలో పోడు వ్యవసాయ విస్తీర్ణం తగ్గటానికి కారణాలు ఏమిటి?
- కొండవాలులో వ్యవసాయం చేసే ఇతర విధానాలు ఏమైనా మీకు తెలుసా?
- పంటల ఎదుగుదలకు బూడిద ఏవిధంగా సహాయపడుతుంది?

- మీ ప్రాంతంలో ఆడవి జంతువులు పంటలను నాశనం చేస్తాయా? వాటినుంచి పంటలను రక్షించుకోడానికి రైతులు ఏం చేస్తారు?

## పెరటి తోటలు

కొండరెడ్లు విశాలమైన ప్రాంగణంలో గుడిసె నిర్మించుకుంటారు. ఇంటి చుట్టూ వెదురుతో కంచె నిర్మిస్తారు. పెరటి భూమిని చదును చేసి పెంటపోగులను ఎరువుగా వేసి దాన్ని సారవంతం చేస్తారు. ఇదే వాళ్ళ పెరటితోట. వారి ఆహారంలో అధికభాగం పెరటితోట నుంచి పొందుతారు. మొక్కజొన్నతో పాటు చిక్కుళ్లు, తీగజాతి మొక్కలు, మిరప మొదలైన కూరగాయలు పండిస్తారు.

## అటవీ ఉత్పత్తులు

పోడు వ్యవసాయం, పెరటితోటలు నుండి వచ్చే ఉత్పత్తి వారికి సంవత్సరం పొడవునా సరిపోదు. కాబట్టి అడవిలో వివిధ రకాల అటవీ ఉత్పత్తుల సేకరణ, వేట వీరి జీవితంలో కీలక భూమికను పోషిస్తాయి. వీరికి అడవి ఒక అద్భుతమైన ఆహారనిధి. సంవత్సరం పొడుగునా అటవీ ఉత్పత్తులపై ఆధారపడతారు.

వీరు సంవత్సరంలో వివిధ ఋతువులలో వివిధ రకాల పళ్లు, దుంపలు, గింజలు, ఆకుకూరల సేకరణ, చిన్న జంతువుల వేట వీరి ప్రత్యేకత.



*చిత్రం 6.7 పోడు పొలాల్లో మంచె*

©SCERT not to be republished



చిత్రం 6.8 బాణాలతో వేట

వేసవిలో ప్రత్యేకించి మరొక ముఖ్యమైన ఆహారం 'జీలుగు' (క్యారియోట పామ్) పానీయం. వీళ్లు పెంచే జంతువులు రోగాలకు గురైతే అడవినుంచి సేకరించిన మూలికలను ఉపయోగించి వైద్యం చేస్తారు. వాళ్లు సాధారణంగా మేకలు, గొర్రెలు, పందులు, కోళ్లు, కుక్కలను పెంచుతారు.

కొండరెడ్లకు అడవులతోను, అటవీ ఉత్పత్తులతోను సాన్నిహిత్యంతో కూడిన పరిజ్ఞానం ఉంది. పెరటి తోటల నుండి, పోడు వ్యవసాయం నుండి వచ్చే ఆహార ఉత్పత్తులతో పాటు అదనంగా అడవులలో దొరికే వాటిని సేకరించడం జరుగుతుంది. వీటిని ప్రతి వారం జరిగే సంతకు పోయి అమ్మడం జరుగుతుంది. అమ్మగా వచ్చిన ఆదాయంతో వారికి రోజువారీ అవసరమయ్యే వస్తువులు, బట్టలు, సరుకులు కొంటారు.

పంట కోతల తర్వాత గిరిజన మహిళలు, పిల్లలు ఆహారంగా పనికొచ్చే అటవీ ఉత్పత్తులను సేకరిస్తారు. వెదురు బొంగుల చిగుళ్ళు, తేనె వీరు సేకరించే రెండు ముఖ్యమైన అటవీ ఉత్పత్తులు. వెదురు బొంగుతో చేసిన నిచ్చెనతో పెద్దచెట్లను ఎక్కి తేనెను సేకరిస్తారు. 'కరి కొమ్ములు' అనే లేత వెదురు చిగుళ్ళను వెదురు పొదలనుంచి సేకరిస్తారు. ఈ చిగుళ్ళ పై పొరను తీసి దీన్ని వండుతారు. ఇది ఎంతో రుచికరమైన వంటకంగా వారు భావిస్తారు.

- ఏయే అటవీ ఉత్పత్తులను మీరు తింటారు?
- ఆహారంగా ఉపయోగించే అటవీ ఉత్పత్తులను మీరు ఎప్పుడైనా సేకరించారా? ఆ అనుభవాన్ని వివరించండి.





చిత్రం 6.9, 6.10 వెదురు కరికొమ్ములు సమకూర్చుకోడం



© SCERT not to be republished





చిత్రం 6.11ఏ , 6.11బి ఎత్తయిన చెట్లు, వెదురు నిచ్చెన

### వెదురు

కొండరెడ్ల జీవనంలో విడదీయరాని భాగమైన వెదురు ఈ అడవులలో విస్తారంగా లభిస్తుంది. వీరు స్వయంగా వినియోగించుకోడవే కాక దీనితో తయారు చేసిన బుట్టలు, తట్టలు, వంటగది దోనెలు మొదలైన వాటిని సంతలలో అమ్ముతారు. కాగితపు పరిశ్రమలవారు తమ ప్రతినిధి ద్వారా వెదురు కోసి సరఫరా చేయవలసిందిగా వీరిని కోరతారు. ఇది నగదు రూపంలో లబ్ధిని ఇచ్చే అదనపు ఉపాధి అవకాశం. మొదట్లో ఈ ఆదాయం తక్కువగా ఉండేది. కానీ గత కొద్ది సంవత్సరాలుగా బాగా పెరిగింది.

### త్రాగునీరు

బావులు, నదులు ఈ ప్రాంతంలో లేవు. రాళ్లతో కూడిన కొండలలో బావులు తవ్వడం చాలా కష్టం. 6.12 చిత్రంలో చూపిన మాదిరి సహజమయిన ఊటలనుంచి కొండరెడ్లు మంచినీటిని తెచ్చుకుంటారు లేదా కొండదిగి వాగులనుంచి తెచ్చుకుంటారు.

### ఆవాసాలు, గృహాలు

6.17 చిత్రంలో చూపినట్లు కొండరెడ్లు, మట్టి, వెదురుతో కట్టిన చిన్న ఇళ్లలో నివసిస్తారు. ఇంటిచుట్టూ





చిత్రం 6.12 కావిడతో నీళ్లు తెచ్చుకొనటం

© SCERT not to be republished

## కొండరెడ్డి మహిళ గంగమ్మతో చర్చ



*చిత్రం 6.13 గంగమ్మ, కొండరెడ్డి స్త్రీ*

**ప్రశ్న: మీరు చేసే బుట్టలు అల్లే పనిని గురించి వివరించండి గంగమ్మ?**

**గంగమ్మ:** నేను రెండు గంటల సమయం పని చేస్తే 10 బుట్టల వరకు అల్లుతాను. ఒక్కొక్క బుట్ట 20/- రూపాయలకు అమ్ముడవుతుంది. ఈ సొమ్ముతో సంతలో మాకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తాం.

**ప్రశ్న: ఈ పని కాకుండా ఇతర పనులేమైనా చేస్తారా?**

**గంగమ్మ:** పోడు వ్యవసాయం చేస్తాం. గత సంవత్సరం పంటలు పండక సమస్యగా ఉంది. కూటూరు చౌకధరల దుకాణం నుండి బియ్యం తీసుకుంటాం. పక్షులు, కుందేళ్లను, కొన్ని సార్లు క్రూర జంతువులను వేటాడతాం.

**ప్రశ్న: అడవినుంచి ఏమేమి సేకరిస్తారు?**

**గంగమ్మ:** తేనె సేకరిస్తాం. కొంత తేనెను విక్రయిస్తాం. మిగిలిన దాన్ని వినియోగిస్తాం.

© SCERT not to be republished

విశాలమైన ఖాళీ స్థలం ఉంటుంది. జంతువులను ఉంచడానికి, వెదురుతో వస్తువులు తయారు చేయడానికి ముందు స్థలాన్ని ఉపయోగిస్తారు. ఈ గుడిసెలకు వెనక భాగంలో పెరటితోటలను పెంచుతారు. ఈ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం లేదు.

ప్రతి ఆవాస ప్రాంతంలో ఏడెనిమిది గుడిసెలు ఉంటాయి. అటువంటి ఆవాసప్రాంతాలు పది వరకు కొండమీద ఉన్నాయి. మొత్తంమీద 528



*చిత్రం 6.15 బుట్టల అమ్మకానికి బయలుదేరడం*



*చిత్రం 6.14 వెదురు గృహోపకరణాలు, వాయిద్యపరికరాలు*

మంది జనాభా కలిగి ఉన్న 78 కుంటుంబాలవాళ్ళు ఇక్కడ జీవిస్తున్నారు. వీరంతా చిన్న గ్రామాలలో ఉ ంటున్నారు. ఈ ఆవాస ప్రాంతాలు శాశ్వతం కావు. ఎప్పుడైనా అంటువ్యాధులు ప్రబలితే ఆ ఆవాస ప్రాంతం విడిచిపెట్టి వేరొక చోట గుడిసెలు వేసుకుంటారు.

కొండరెడ్లలో అతిముఖ్యమైనది, ఉమ్మడి కుటుంబ జీవనం. కుటుంబంలోని అందరు వ్యక్తులూ కలిసి వ్యవసాయ క్షేత్రాలలో, వేటాడటంలో, చివరకు ఆహార



చిత్రం 6.16 వెదురు తెచ్చుకోడం

ఉత్పత్తుల సేకరణలో కూడా కలిసి పనిచేస్తారు. మగవారు, ఆడవారు అనే భేదం లేకుండా అన్ని పనులను వాళ్ళు కలిసి చేస్తారు. ముఖ్యంగా మగవారు వ్యవసాయం, పశువుల పెంపకంలో, ఆడవారు, పిల్లలు అడవులనుండి ఆహార సేకరణలో, బుట్టలు అల్లడంలో ఎక్కువగా పనిచేస్తారు.

## సంప్రదాయాలు

కొండరెడ్లు ప్రకృతి దేవతలను ఆరాధిస్తారు. ప్రతి కుటుంబానికీ ప్రత్యేకంగా కులదేవత ఉంటుంది. వారి ఇంటిముందు పొడవైన కర్రను పాతి, కొన్ని వేప మండలు కడతారు. దీన్ని ముత్యాలమ్మగా భావించి ఆరాధిస్తారు. మగవారు మాత్రమే అడవికి వెళ్ళి అడవి దేవతలను పూజిస్తారు. వారి పండుగలు కాలాలను సూచిస్తాయి. మామిడి పండుగ, గోంగూర పండుగ వంటివి జరుపుతారు. అన్నిటికంటే మామిడి పండుగ ప్రధానమైనది. గోంగూర పండుగ సెప్టెంబర్ నెలలో



చిత్రం 6.17 వెదురుతో ఇళ్ళ నిర్మాణం

వస్తుంది. దేవతలకు కూరగాయలు పెట్టి వాటిని ప్రసాదంగా స్వీకరిస్తారు. పచ్చపండుగ మరొక ముఖ్యమైన పండుగ. ముఖ్యమైన వ్యవసాయ కార్యక్రమాలన్నీ, అంటే కోత, అడవి నుంచి పళ్ళసేకరణ వంటివి ఈ పండుగల తర్వాత ప్రారంభమవుతాయి. పండుగల సమయంలో తెగ సభ్యులు అందరూ వేరు వేరు ఆవాస ప్రాంతాలలో ఉన్నప్పటికీ ఒకే ప్రదేశంలో చేరి సంబరాలు జరుపుకుంటారు.

## కొండరెడ్ల భవిష్యత్తు

కొండరెడ్ల జనాభా సంఖ్యాపరంగా తక్కువ. వారి జీవన విధానం చాలా భిన్నమైనది, పురాతనమైనది. వారి జీవన విధానం ప్రకృతికి అనుకూలంగా ఉంటుంది. దుక్కి వ్యవసాయం, ఖనిజాల వెలికితీత, పరిశ్రమలు, ఉత్పాదకత, పట్టణ జీవనంతో పోలిస్తే వీళ్ళు పర్యావరణానికి అతి తక్కువగా నష్టం కలుగచేస్తారు. వీళ్ళ జీవితం పూర్తిగా అడవిమీద ఆధార పడుతుంది. అయినా వారు అడవులను నాశనం చేయరు. పోడు వ్యవసాయానికి అడవులను నరికినా,



చిత్రం 6.18 ముత్యాలమ్మ దేవత

తిరిగి ఆ ప్రాంతంలో చెట్లు పెరగడానికి వారు పాటుపడతారు. అడవులతో వీరికి సాన్నిహిత్యం ఎక్కువ. అడవుల పర్యావరణం గూర్చి, అక్కడ వనరుల వినియోగం గూర్చి సంపూర్ణ అవగాహన ఉంది. అలాగని వాటి ఉనికికి భంగం కలగజేయరు. ఈ విధంగా జీవించాలంటే పర్యావరణానికి విఘాతం కలిగించకుండా విశాలమైన ప్రాంతాన్ని వీరికి వదిలి పెట్టవలసి ఉంది.

- మనం పీఠభూమి ప్రాంతంలో గల వ్యవసాయ సుస్థిరత గూర్చి మాట్లాడాం. మూడు ప్రాంతాల పల్లెలలో నివసించే ప్రజల జీవనోపాదుల సుస్థిరతను పోల్చండి.

కొండరెడ్డి గిరిజనుల అవసరాలు చాలా తక్కువ. అవి అడవులతో తీరుతాయి. సంపదలతో ఉన్న అడవులు వారికి ఎల్లప్పుడూ ఇలానే ఉపయోగపడతాయని అనుకోడానికి లేదు. వారి జీవన విధానానికి బయట సమాజం నుంచి ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. అటవీ అధికారులు పోడు వ్యవసాయాన్ని ఆపటానికి ప్రయత్నిస్తున్నారు. అడవులను నరకడం వల్ల, పేపరు మిల్లుల అవసరాల దృష్ట్యా ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో వెదురును తీసుకుపోవడంవల్ల చాలా అటవీ విస్తీర్ణం తగ్గిపోతోంది.

గోదావరి నదికి పోలవరం దగ్గర పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఇక్కడి డ్యాంలో నిలవ చేసే నీటి వల్ల కూనవరం మండలంలోని చాలా గ్రామాలు మునిగిపోయే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు వల్ల కృష్ణ, గోదావరి డెల్టా గ్రామాలకు నీటిపారుదల సౌకర్యం కలుగుతుంది. ఇటువంటి పరిస్థితులలో కొండరెడ్లు కొండలమీద నివసించడం చాలా కష్టం.

© SCERT not to be republished



*చిత్రం 6.19 కూటురు పల్లెలో ఉన్న సంత*

**కీలక పదాలు**

గిరిజనులు
పోడు
వెదురు
పెరటితోట
అటవీ ఉత్పత్తులు
ఆచారాలు


చిత్రం 6.20 బుట్టలు అల్లడం కోసం వెదురును చీల్చడం

- పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తే ఏ విధంగా లాభమో, దానివల్ల ఏ గ్రామాలు మునిగిపోతాయో తెలియజేయండి. దాన్ని గురించి మీ తరగతి గదిలో చర్చించండి.

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి!

1. కొండరెడ్లు ఏ ఏ విధాలుగా అడవులమీద ఆధారపడతారు?
2. కొండరెడ్ల విభిన్న జీవనాధారాలను పట్టిక రూపంలో రాయండి.
3. వాళ్ళు చాలా రకాల పంటలు ఎందుకు పండిస్తారు?
4. అదే వ్యవసాయక్షేత్రాలలో ప్రతి సంవత్సరం పంటలు పండిస్తే ఏమవుతుంది?
5. మీరు చదివిన ఈ మూడు గ్రామాలలోని వ్యవసాయక్షేత్రాల సహజ పరిస్థితులను సరిపోల్చండి. వీటి మధ్య గల పోలికలను, భేదాలను తెలపండి.
6. మైదానం, పీఠభూమి ప్రాంతాలలోని కుటుంబాలవారు చేసే పనిని, కొండరెడ్లు చేసే పనులతో పోల్చండి.
7. కొండరెడ్ల జీవన విధానాన్ని పరిరక్షించుకోవడం ముఖ్యమని భావిస్తారా? కారణాలు తెలపండి.
8. కొండరెడ్ల సాంస్కృతిక కార్యకలాపాలనుగూర్చి వివరించండి.
9. ఆంధ్రప్రదేశ్ పటంలో ఈ క్రింది వానిని గుర్తించుము.

   (ఎ) ఖమ్మం (బి) బైసన్‌కొండలు (సి) గోదావరి నది